సంపత్‌రెడ్డి కుటుంబానికి కడియం పరామర్శ

సంపత్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కడియం

చిల్పూరు, డిసెంబర్ 8 : ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం పరామర్శించారు. సంపత్‌రెడ్డి స్వగ్రామమైన రాజవరంలో ఐదవ రోజు కార్యక్రమం నిర్వహించగా కడియం శ్రీహరి హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపత్‌రెడ్డి లాంటి చురుకైన నాయకుడిని కోల్పోవడం పార్టీకి, కుటుంబానికి తీరని లోటన్నారు. సంపత్‌రెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రాజయ్య సంపత్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కడియం వెంట గ్రామ సర్పంచ్ మారెపల్లి తిరుమలాకృష్ణమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ మారెపల్లి లలితాదేవిశ్యామ్‌కుమార్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు భూక్యా రమేశ్‌నాయక్, చిల్పూరు సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మామిడాల లింగారెడ్డి, చిర్ర రాజుగౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు జనగామ యాదగిరి, జగన్నాథం, స్వామినాయక్, సంపత్‌కుమార్, నరేందర్‌రెడ్డి, మచ్చ రమేశ్, సమ్మయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

మరమ్మతు పనులకు అంచనా వేయాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి క్యాంపు కార్యాలయం పరిశీలన

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 8 : నియోజకవర్గ కేంద్రంలోని క్యాంపు కార్యాలయం మరమ్మతు పనులకు నిధుల మంజూరుకు ఎస్టిమేషన్ వేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆర్డీవో వాసం రామ్మూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, పంచాయతీ కార్యదర్శులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పరిశీలించారు. క్యాంపు కార్యాలయంలో మరమ్మతులు చేపట్టాలని, లిఫ్ట్ ఏర్పాటుకు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి క్యాంపు కార్యాలయం వరకు డబుల్ రోడ్ ఏర్పాటుకు ఎస్టిమేషన్ వేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం మొదటి సారిగా క్యాంపు కార్యాలయానికి వచ్చిన కడియం శ్రీహరికి అధికారులు, బీఆర్ఎస్ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, బూర్ల శంకర్, రాజేశ్‌నాయక్, గట్టయ్య, రాపోలు మధుసూదన్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పోగుల సారంగపాణి, అనితాసుధాకర్‌బాబు, ఎంపీటీసీలు రజాక్‌యాదవ్, గుర్రం రాజు, మాజీ జడ్పీటీసీ స్వామినాయక్, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు గట్టు రమేశ్, అంబటి కిషన్‌రాజ్, వెంకటేశ్‌నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ అరోగ్యంగా తిరిగి రావాలని పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేసీఆర్ కోలుకోవాలని పూజలు

జనగామ రూరల్, డిసెంబర్ 8 : ఎర్రవల్లిలోని తన స్వగృహంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడి గాయపడిన మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు త్వరగా కోలుకోవాలని మండలంలోని పెంబర్తి గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణులు దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక మొక్కులు చెల్లించి కేసీఆర్ అరోగ్యంగా తిరిగి వచ్చి ప్రజలతో కలిసి అందరికీ ధైర్యంగా ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ ఉపాధ్యక్షుడు బంద్రు సత్తయ్య, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కంతిరి ప్రేమ్‌సాగర్, యువజన సంఘం అధ్యక్షుడు చినబోయిన రాజు, వార్డు సభ్యుడు ఇబ్రహీం, ఎంబరి ప్రశాంత్, ఆత్మకూరి యాదగిరి పాల్గొన్నారు.

దుర్గామాతకు పూజలు..

దుర్గమ్మకు పూజలు చేస్తున్న బీఆర్ఎస్ యూత్ నేతలు

బచ్చన్నపేట : రాష్ట్ర మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని వేడుకుంటూ శుక్రవారం మండల కేంద్రంలోని దుర్గమ్మ ఆలయంలో బీఆర్ఎస్ నేతలు పూజలు చేశారు. మండల బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ పడిగెల కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ యువనేత కొత్తపల్లి శ్రీనివాస్ కలిసి అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశా రు. కేసీఆర్ ఆరోగ్యం త్వరగా కోలుకునే లా దీవించు తల్లీ అంటూ వేడుకున్నారు. రాష్ట్ర ప్రజలకు పదేళ్లు సేవలు అందించిన కేసీఆర్, ఆయన కుటుంబాన్ని చల్లంగ చూడాలని వారు ఆకాంక్షించారు.

నేషనల్ కబడ్డీకి ధనుష ఎంపిక

జనగామ చౌరస్తా, డిసెంబర్ 8 : పంజాబ్‌లో జరిగే నేషనల్ 70వ సీనియర్ మహిళా కబడ్డీ పోటీలకు జనగామ జిల్లా నుంచి పన్నీరు ధనుష ఎంపికైనట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోటకూరి గట్టయ్యయాదవ్, చైర్మన్ వై కుమార్ గౌడ్, అధ్యక్షుడు పోగుల సారంగపాణి, కోచ్ డాక్టర్ తోటకూరి వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. ఇటీవల నిజామాబాద్ జిల్లా భూసాపూర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ధనుష ఉత్తమ ప్రతిభకనబర్చినందున సెలక్షన్ కమిటీ పంజాబ్‌లో జరిగే నేషనల్ పోటీలకు ఎంపిక చేసినట్లుగా వారు తెలిపారు. ఈ సందర్భంగా ధనుషను కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి ఎదునూరి ఉప్పలయ్య, 12మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, ఈసీ మెంబర్స్, అఫీషియల్స్, క్రీడాకారులు, క్రీడా పోషకులు అభినందించారు.

కార్యకర్తలు అధైర్య పడొద్దు

- డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి
- కార్యకర్తలతో సమావేశం

మాట్లాడుతున్న కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి

కొడకండ్ల, డిసెంబర్ 8 : రాజకీయంలో గెలుపోటమిలు సహజమని, పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన తీర్పును అంగీకరిస్తున్నామని, కార్యకర్తలు అధైర్య పడొద్దని డీసీసీబీ వైస్‌చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు సిందే రామోజీ అధ్యక్షతన కార్యకర్తలు, బీఆర్ఎస్ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గ, కొడకండ్ల మండలంలో అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన దయాకర్‌రావును గెలిపించుకోకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ప్రజల మనిషి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఓటమితో క్రుంగిపోకుండా ప్రజలలో ఉండి ప్రజలను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటారని అన్నారు. కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దని, అన్నివిధాల ఆదుకుంటామని తెలిపారు.

'తొలిమెట్టు, ఉన్నతి' లక్ష్యాలను చేరాలి

శిక్షణ కార్యక్రమంలో డీఈవో రాము

సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రాము

దేవరుప్పుల, డిసెంబర్ 8 : విద్యార్థుల్లో మేధోసంపత్తి పెంచడానికి విద్యాశాఖ ప్రవేశపెట్టిన తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను అమలు చేసి లక్ష్యాలను చేరాలని డీఈవో రాము సూచించారు. కోలుకొండ పాఠశాలలో శుక్రవారం స్కూల్ కాంప్లెక్స్‌లో దేవరుప్పుల, లింగాలఘనపురం పరిధిలోని ఫిజికల్‌సైన్స్ ఉపాధ్యాయులకు నిర్వహించి శిక్షణా కార్యక్రమానికి డీఈవో హాజరై మాట్లాడారు. విద్యాభివృద్ధిలో ఉన్నతి, తొలిమెట్టు లక్ష్యాలను వివరించారు. బోధన, అంతిమ లక్ష్యం ప్రతి విద్యార్థి చదవడం, రాయడమేనని, అందుకనుగుణంగా ప్రణాళిక ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ, సహాయ కార్యదర్శి మెరుగు రామరాజు, నోడల్ అధికారి నర్సయ్య, హెచ్ఎం రాజిరెడ్డి, విషయ నిపుణులు రంగాచారి, శ్రీనివాసాచారి, సీఆర్పీలు ఉన్నారు.

మహిళ లకు నేటి నుంచి ఉచిత బస్సు సౌకర్యం

ఎంపీటీసీ నల్లగోని పుష్పాబాలకిషన్‌గౌడ్

బచ్చన్నపేట, డిసెంబర్ 8 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీ జన్మదినం పురస్కరించుకుని మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని బచ్చన్నపేట ఎంపీటీసీ నల్లగోని పుష్పాబాలకిషన్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోలో భాగంగా ఆరుగ్యారంటీల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం నేడు (శనివారం) సోనియమ్మ జన్మదినం సందర్భంగా ప్రారంభిస్తారని తెలిపారు.

ప్రతి మహిళా ఆధార్‌కార్డుతో బస్సులో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించిందని, సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఆమె వెంట మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సన్మానిస్తున్న టీఎన్జీవోస్ జిల్లా కమిటీ నాయకులు

కలెక్టర్ శివలింగయ్యకు సన్మానం

జనగామ చౌరస్తా, డిసెంబర్ 8 : కలెక్టరేట్‌లో కలెక్టర్ సీహెచ్ శివలింగయ్యను శుక్రవారం తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం (టీఎన్జీవోస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా షరీఫ్, పెండెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాలువా, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన శాసనసభ 2023ఎన్నికల విధుల్లో ప్రభుత్వ ఉద్యోగులది కీలకపాత్ర అని గుర్తు చేశారు. ఉద్యోగులు సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. అనంతరం జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవోలు మురళీకృష్ణ, రామ్మూర్తి, కలెక్టరేట్ ఏవో రవీందర్‌ను టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా ఉపాధ్యక్షులు చింత రాంనర్సయ్య, ఉప్పలయ్య, సంపత్, పట్టణ కార్యదర్శి మధు, పాలకుర్తి తాలుకా అధ్యక్షుడు చందర్, మెడికల్ ఫోరమ్ అధ్యక్షుడు మానుపాటి నర్సయ్య, శారద, సృజన, ప్రభాకర్, కృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సామాజిక ఆరోగ్య అధికారి రెహమాన్

వాయు కాలుష్యంపై అవగాహన

జనగామ చౌరస్తా, డిసెంబర్ 8 : జనగామ పట్టణ కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం జాతీయ వాతావరణ మార్పు, మానవ ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వాయు కాలుష్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సామాజిక ఆరోగ్య అధికారి రెహమాన్ హాజరై మాట్లాడుతూ వాయు కాలుష్యంతో దీర్ఘకాలిక శ్వాసకోశ సంబంధిత వ్యాధులతోపాటు క్యాన్సర్‌కు గురయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. పారిశ్రామిక ఉద్గారం, శిలాజ ఇంధనాల దహనం, రవాణా ఇంధన వినియోగం, వ్యర్థ పదార్థాలు, అడవుల దహనంతో వాయు కాలుష్యం పెరుగుతుందన్నారు. దీని నివారణకు ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు పెంచాలని సూచించారు. ఎపిడెమిలాజిస్ట్ మోహన్ రాథోడ్, కళాశాల ప్రిన్సిపాల్ అనిల్‌బాబు, ఆరోగ్య సిబ్బంది హబీబ్, ప్రసాద్, అనిత, మంగ, స్వప్న పాల్గొన్నారు.

చిల్పూరులో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

చిల్పూరు/బచ్చన్నపేట, డిసెంబర్ 8 : చిల్పూరు బుగులు వేంకటేశ్వరస్వామి దేవాలయంలో, బచ్చన్నపేట మండలకేంద్రంలోని శ్రీ శివభక్త మార్కండేయస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. చిల్పూరు ఆలయ ప్రాంగణంలోని కాలక్షేప మండలంలో నిర్వహించిన వ్రతాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు. స్వామి వారిని బలగం మూవీ సీనియర్ యాక్టర్ నారాయణ (మురళీధర్‌గౌడ్), కృష్ణమూర్తి దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఆలయ ఈవో భాగం లక్ష్మీప్రసన్న, అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, సిబ్బంది రమేశ్, వీరన్న, శేఖర్, మహేశ్, విశాల్, బచ్చన్నపేటలో పూజారి గణపురం ఆనంద్, గోలి బుచ్చిరాజు పాల్గొన్నారు.


సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

ప్రమాదవశాత్తు జారిపడి రైతు మృతి

లింగాలఘనపురం, డిసెంబర్ 8 : లింగాలఘనపురంలో ఓ రైతు వరిమడిలో పడి ఊపిరి ఆడక మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. బెజ్జం ఎల్లయ్య (58) రోజువారీగా శుక్రవారం తన వ్యవసాయం పొలం వద్దకు వెళ్లాడు. సాయంత్రం పొలం గట్లపై నడుస్తూ పనులను పరిశీలిస్తున్నాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న వరిమడి బురదలో జారిపడి ఊపిరి ఆడక మృతి చెందాడు. మృతుడికి భార్య భద్రమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు.